# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 15 ఆగస్టు 2025 | www.balagamtv.com | పేజీలు 4


## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు



- తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. పరాయి పాలన నుండి దాస్య శృంఖలాలను తెంచుకుని, స్వేచ్ఛా వాయువులతో భరతమాత స్వయంపాలన దిశగా అడుగులేసి, నేటికి 79 ఏండ్లు గడిచినాయని ఈ సందర్భంగా కేసీఆర్ పేర్కొన్నారు. త్యాగనిరతితో ఎందరో అమర వీరులు, దేశ భక్తులు చేసిన ఆత్మార్పణలు మహోన్నతమైనవని కేసీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన బలిదానాలు, త్యాగాల చరిత్రను కేసీఆర్ స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకు చేరే దాకా కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య

మిగితా 4వ పేజీలో

# జమ్మూ కాశ్మీర్‌లో క్లౌడ్ బరస్ట్..

- కిష్త్వార్ జిల్లా ఛాషోటీ ప్రాంతంలో ఘటన
- 46 మంది మృతి
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

జమ్మూ కాశ్మీర్‌లో కురుస్తున్న భారీ వర్షాలు ప్రళయాన్ని ముంచెత్తాయి. గురువారం కిష్త్వార్ జిల్లా ఛాషోటీ ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ సంభవించి పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం 46 మంది యాత్రికులు మృతి చెందగా, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విషాద ఘటన చోటు చేసుకున్న వెంటనే జిల్లా పరిపాలన, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మాతా చండీ ఆలయానికి వెళ్లే చివరి గ్రామమైన ఛాషోటీ వద్ద యాత్రికులు నదిని దాటుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, అవసరమైతే హెలికాప్టర్ల సాయంతో సహాయక చర్యలు అందిస్తామని కిష్త్వార్ డీసీ పంకజ్ కుమార్ శర్మకు హామీ ఇచ్చారు.

జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 12 మంది మరణించినట్లు ధృవీకరించి, మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. సహాయక చర్యలను యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని పౌర, పోలీస్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంఘటనతో మొత్తం ప్రాంతంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

శిథిలాలు, వరదల్లో చిక్కుకున్న 120 మందిని కాపాడామనీ, వారిలో 38మంది పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. మృతుల్లో ఇద్దరు సీఐఎస్ఎఫ్ సిబ్బంది కూడా ఉన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసులు, ఆర్మీ, స్థానిక వాలంటీర్లు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. కిస్త్వాడ్ జిల్లాలో ప్రసిద్ధి చెందిన మాచైల్ మాతా (చండీమాత)మందిరానికి వెళ్లే యాత్ర బేస్ పాయింట్ వద్ద దుర్ఘటన తీవ్రత ఎక్కువగా ఉంది. యాత్రికులు ఇక్కడే తమ వాహనాలు ఉంచి, కాలి నడకన దర్శనానికి వెళ్తారు. ఆ సమయంలోనే అకస్మాత్తుగా మేఘ విస్ఫోటనం జరిగింది. ఈ సందర్భంగా జమ్మూ కాశ్మీర్ సహాయ కమిషనర్ పంకజ్ శర్మ మీడియాతో మాట్లాడుతూ 'కిస్త్వాడ్ ప్రాంతంలోని చోసిటీలో మెరుపు వరదలు చోటుచేసుకొన్నాయి. ఇది మాచైల్ మాత మందిర యాత్రకు బేస్ క్యాంప్. సహాయక కార్యక్రమాలు మొదలయ్యాయి' చెప్పారు. దీనిపై కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ స్పందించారు. 'చోసిటీలో క్లౌడ్ బరస్ట్ వల్ల భారీగా ప్రాణనష్టం చోటు చేసుకుంది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ యంత్రాంగం సహాయ చర్యల్ని వేగవంతం చేసింది. నష్టాన్ని అంచనా వేయడం, వైద్య సౌకర్యాలు కల్పించడం చేస్తున్నాం. ఎప్పటిక ప్పుడు అక్కడి పరిస్థితుల్ని సమీక్షిస్తున్నాం' అని తెలిపారు. క్లౌడ్‌బరస్ట్ విధ్వంస ఘటన అనంతరం అక్కడి పరిస్థితులపై కేంద్రమంత్రి అమిత్‌షా ఆరా తీసారు. ఆ రాష్ట్ర గవర్నర్ మనోజ్ సిన్హా ముఖ్యమంత్రితో టెలిఫోన్‌లో మాట్లాడారు. అవసరమైతే మరిన్ని కేంద్ర బలగాలను పంపిస్తామని చెప్పారు.

భారీ ప్రకృతి వైపరీత్యం నేపథ్యంలో మాచైల్ యాత్రను నిలిపివేస్తున్నట్టు అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే చోసిటీకి వెళ్లాయనీ, అదనపు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. మాచైల్ మాతా మందిరం సముద్ర మట్టానికి 2,800 మీటర్ల ఎత్తులో ఉంది. జులై 25న ఈ యాత్ర మొదలైంది. జమ్మూ డివిజన్ నుంచి వేల సంఖ్యలో యాత్రికులు ఇక్కడకు వచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన ఈ యాత్ర ముగియనుంది. ఈ విషాదం నేపథ్యంలో మాచైల్ యాత్రను నిలిపివేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ప్రజలు, యాత్రికులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐదుగురు అధికారులను కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంచారు. దుర్ఘటన నుంచి రక్షింపబడిన వారి వివరాలకు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఫోటోలతో సహా పెట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



## నాగార్జునసాగర్ 26 గేట్లు ఎత్తివేత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌లో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. శుక్రవారం శ్రీశైలం జలాశయం నుండి 1,72,774 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో, డ్యామ్ అధికారులు 26 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,03,502 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుండి వరద నీరు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో, గురువారం మధ్యాహ్నం 8 గేట్ల ఎత్తును 10 అడుగుల నుండి 5 అడుగులకు తగ్గించారు. సాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 587.40 అడుగుల వద్ద నిల్వ ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టిఎంసీలు కాగా, ప్రస్తుతం 305.7464 టిఎంసీలు నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 29,576 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు.

అదేవిధంగా, కుడి కాలువ ద్వారా 1,540 క్యూసెక్కులు, ఎస్.ఎల్.బి.సి ద్వారా 2,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మొత్తం రిజర్వాయర్ నుండి 2,36,958 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

## పరిగి మండలంలో స్వల్ప భూకంపం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

వికారాబాద్ జిల్లా పరిగి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు స్వల్ప భూకంపం సంభవించింది. పరిగి మున్సిపల్ పరిధిలోని టీచర్స్ కాలనీ, న్యాత్‌నగర్, రంగాపూర్, బసిరెడ్డిపల్లి, సోమన్‌గుర్తి గ్రామాల్లో మూడు నిమిషాల పాటు భూ ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. దీంతో భయంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పూడూరు మండలంలోని సోమన్‌గుర్తి గ్రామంలో వీరన్నవాళ్ల అన్న బుచ్చయ్య ఇల్లు కూలిపోయింది. భూకంపం వచ్చిన సమయంలో 'దడదడ' శబ్దం వినిపించిందని గ్రామస్థులు చెప్పారు. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీఓలు కలిసి బసిరెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు. స్థానికులతో భూకంపం పరిస్థితులను తెలుసుకున్నారు. ఇండ్ల పగుళ్లు లేదా ఇతర నష్టం ఉంటే వెంటనే గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలు భయపడవద్దని కలెక్టర్ సూచించారు. భూకంపంపై శాస్త్రవేత్తలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నామని, ఇది భూకంపమని తేలితే మళ్లీ రావచ్చని హెచ్చరించారు. సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, ఏ సమాచారం ఉన్నా అధికారులకు చెప్పాలని ప్రజలను కోరారు. జిల్లాలో ఆగస్టు 17 వరకు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. అత్యవసర పరిస్థితి తప్ప ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. భారీ వర్షాల కారణంగా పర్యాటక ప్రాంతాల్లో బోటింగ్, ట్రెక్కింగ్ కార్యకలాపాలను నిలిపివేశారు. పర్యాటకులు రాకూడదని సూచించారు. పరిగి వాగు ఎప్పొంగుతున్న దృశ్యాలను కలెక్టర్ అధికారులతో కలిసి పరిశీలించారు.

## మూసీ వంతెనల నిర్మాణం నిలిచిపోయింది

- కేటీఆర్ తీవ్ర విమర్శలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మూసీ నదిపై వంతెనల నిర్మాణంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అలసత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా తీవ్రంగా ఎండగట్టారు. హైదరాబాద్ వాసుల చిరకాల కలగా ఉన్న ఈ ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించిందని గుర్తు చేశారు. 2022 జనవరిలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.545 కోట్లతో 15 వంతెనల నిర్మాణానికి ఆమోదం తెలిపిందని, ప్రతి వంతెన పొడవు 150-200 మీటర్ల వరకు ఉంటుందని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క వంతెన కూడా పూర్తి కాలేదని, పనులు పూర్తిగా ఆగిపోయాయని విమర్శించారు. "నిర్లక్ష్యం, అసమర్థత, చేతగానితనం... ఇవే కాంగ్రెస్ పాలనకు నిదర్శనం. ఇది పనికిమాలిన ప్రభుత్వం" అని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వంతెనలు పూర్తి అయితే నగర రాకపోకలు సులభతరమయ్యే అవకాశం ఉండేదని, కానీ ప్రస్తుత పాలన ఆ అవకాశాన్ని వృథా చేసిందని ఆరోపించారు.

## 19 నుంచి డీసెట్ స్పాట్ అడ్మిషన్లు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

డిప్లొమ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఐఈడీ), డిప్లొమ ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ)లో 2025-27 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఈనెల 19 నుంచి డీసెట్ కౌన్సెలింగ్‌లో స్పాట్ అడ్మిషన్ల ప్రారంభం కానుంది. ఈ మేరకు డీసెట్ కన్వీనర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ జి రమేష్ గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. డైట్ కాలేజీలు, కేటగిరీల వారీగా ఖాళీల వివరాలను ఈనెల 17న www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో విడుదల చేస్తామని తెలిపారు. అదేనెల 18న మీడియాలో నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. 19న ప్రభుత్వ డైట్ కాలేజీలు, 20న ప్రయివేటు డైట్ కాలేజీల వద్ద అభ్యర్థులు అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఆయా తేదీల్లో స్పాట్ అడ్మిషన్లను కేటాయిస్తామని తెలిపారు. ఈనెల 21న ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు. అదేనెల 22న సాయంత్రం ఆరు గంటల వరకు స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశాలు పొందిన అభ్యర్థుల వివరాలను డీసెట్ వెబ్‌సైట్‌లో కాలేజీల ప్రిన్సిపాళ్లు అప్‌లోడ్ చేయాలని కోరారు. ఈనెల 25 నాటికి వాటికి ర్యాటిఫికేషన్ పొందాలని తెలిపారు. ఇప్పటికే డీసెట్ ద్వారా డైట్ కాలేజీల్లో సీట్లు పొందిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్లకు అనర్హులని స్పష్టం చేశారు. స్పాట్ అడ్మిషన్లలో ప్రవేశాలు పొందే అభ్యర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించబోదని వివరించారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. రాష్ట్రంలో డీసెట్‌లో 26,442 మంది అభ్యర్థులు అర్హత సాధించారని వివరించారు. రాష్ట్రంలో 10 డైట్ కకాలేజీల్లో 1,400 సీట్లున్నాయనీ, వాటిలో 1,165 మంది ప్రవేశాలు పొందారని తెలిపారు. ఇంకా 235 సీట్లు మిగిలాయని పేర్కొన్నారు. 63 ప్రయివేటు

మిగితా 4వ పేజీలో

# తొలగించిన ఓటర్ల వివరాలు ప్రకటించండి

- 19 లోపు వెబ్‌సైట్‌లో పెట్టాలి
- కారణాలూ ప్రచురించాలి
- 22 నాటికి దానిపై నివేదికను ఇవ్వాలి
- బీహార్ ఎస్ఐఆర్‌పై ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశాలు



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

కేంద్ర ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టు కొరడా ఝుళిపించింది. బీహార్‌లో 'సర్' పేరుతో తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఏ కారణాలతో వారిని జాబితా నుంచి తొలగించారో స్పష్టం చేయాలనీ, వీటన్నింటినీ ఈనెల 19వ తేదీలోపు కేంద్ర ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పెట్టాలని చెప్పింది. అలాగే దీనికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 22 న్యాయస్థానానికి నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అలాగే ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారు ఆధార్ కార్డు సమర్పించవచ్చని సుప్రీంకోర్టు తెలిపింది. బీహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టులో గురువారం విచారణ కొనసాగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం విచారణను జరిపింది. ఈ సందర్భంగా ఈసీ తన వాదనలు వినిపించింది. ఓటర్ల జాబితా సవరణ వంటి నిర్ణయాలు తీసుకునేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయని తెలిపింది. పార్టీల పోరు మధ్యలో చిక్కుకున్నామనీ, గెలిస్తే ఈవీఎంలు మంచివనీ, ఓడిపోతే చెడ్డవనే ప్రచారం చేస్తున్నారని సుప్రీంకోర్టు ధర్మాసనానికి ఈసీ వివరిం చింది. ఓటర్ల జాబితాలో మరణించిన, వలసవెళ్లిన, ఇతర నియోజకవర్గాలకు తరలిన ఓటర్ల పేర్లను ఎందుకు వెల్లడించలేరని ఈసీని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. ఆ పేర్లను ఎందుకు బహిర్గతం చేయకూడదని ఆదేశించింది. చనిపోయారన్న కారణంతో 22 లక్షల మంది పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించినట్టు కథనాలు వచ్చిన విషయం విదితమే. అయితే బూత్‌లెవల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని సర్వోన్నత న్యాయస్థానం ఈసీని ప్రశ్నించింది. రాజకీయ పార్టీలపై పౌరుల హక్కులు ఆధారపడటం తమకు ఇష్టం లేదని తెలిపింది. ఐతే తొలగించిన ఓట్ల జాబితాను రాజకీయపార్టీలకు ఇచ్చినట్టు ఈసీ వెల్లడించింది. జిల్లా స్థాయిలో ఈ వివరాలను పంచుకునేందుకు సిద్ధమని తెలిపింది. ఈ క్రమంలోనే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను ఆగస్టు 19 నాటికి బహిర్గతం చేయాలని ఈసీని సుప్రీంకోర్టు ఆదేశించింది. తొలగింపునకు కారణాలు కూడా ప్రచురించి.. జిల్లా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉంచాలని స్పష్టం చేసింది. వార్తాపత్రికలు, రేడియో, టీవీ మాధ్యమాల ద్వారా దీనిపై ప్రచా రం కల్పించాలని సూచించింది. తన ఆదేశాలపై తీసుకున్న చర్యలపై ఆగస్టు 22లోగా నివేదికను దాఖలు చేయాలని ఆదేశించింది. విచారణను వాయిదా వేసింది. దీంతో సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా తొలగిం పునకు గురైన ఓటర్ల జాబితాను ప్రచురించాల్సిన బాధ్యత ఈసీకి ఏర్పడింది.

పేర్లు వెబ్‌సైట్‌లో లేదా ప్రజా నోటీసు రూపంలో ఉంచితే, బాధితులు 30 రోజుల్లో తమ సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని సుప్రీంకోర్టు సూచించింది. దీని పట్ల కమిషన్ సానుకూలంగా స్పందించింది. బీహార్ ప్రత్యేక సర్వే నిర్ణయాన్ని ఆర్జేడీ, కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలు, అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్ సవాలు చేశాయి. ఆగస్టు 13న సుప్రీంకోర్టు, ఓటర్ల జాబితా స్థిరంగా ఉండదని, సవరణ తప్పనిసరి అని పేర్కొంది. ఓటరుల గుర్తింపుకు అనుమతించబడిన పత్రాలను 7 నుంచి 11కి విస్తరించడం "ఓటర్ ఫ్రెండ్లీ" చర్య అని స్పష్టం చేసింది.

# స్వావలంబన దిశగా భారత్

- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా దేశ ప్రజలకు రాష్ట్రపతి సందేశం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

న్యూఢిల్లీ: స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని సూచిస్తున్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ప్రసంగించారు.పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా అభివర్ణిస్తూ, ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్' చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు.

"పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు మన ఆర్మీ గుణపాఠం నేర్పింది. సుపరిపాలన, అవినీతి సహించని విధానాలతో భవిష్యత్తు దిశగా దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5% జీడీపీ వృద్ధి రేటుతో భారత్ ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలిచింది. కశ్మీర్ లోయలో రైలుమార్గం స్థానిక పర్యాటకం, వాణిజ్యానికి ఊతమిస్తుంది." అన్నారు.

అంతరిక్ష రంగంలో శుభాంశు శుక్లా చేసిన ప్రయాణం కొత్త తరానికి కలల స్ఫూర్తినిచ్చిందని, 'గగన్‌యాన్' మానవ సహిత అంతరిక్ష యాత్రకు ఇది తోడ్పడుతుందని రాష్ట్రపతి అన్నారు. చెస్‌లో భారత్ ఆధిపత్యం చారిత్రకమని, జాతీయ విద్యా విధానం - 2020 విస్తృత మార్పులు తెచ్చిందని పేర్కొన్నారు. ఆదాయ, ప్రాంతీయ అసమానతలు తగ్గిపోతున్నాయని, సామాజిక సంక్షేమంతో కూడిన సమగ్ర ఆర్థిక వృద్ధి 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలబెడుతుందని ముర్ము అభిప్రాయపడ్డారు.

**"ఆలోచనాత్మక ప్రసంగం" : ప్రధాని మోదీ**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం ఆలోచనాత్మకమని, దేశ సమష్టి పురోగతి, రాబోయే అవకాశాలను ప్రస్తావించారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేసి, ప్రతి పౌరుడు దేశ నిర్మాణంలో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

# వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ. కోటి



- వచ్చే 24 గంటలు మరింత అప్రమత్తంగా ఉండాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు
- ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులు
- సెలవుల్లో ఉన్న వారిని వెనక్కి పిలవండి
- వరద సహాయక చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలకు మంత్రి పొంగులేటి ఆదేశం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు రూ.కోటి అత్యవసర నిధులు మంజూరు చేస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. వరద సహాయక చర్యలపె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మరో మూడ్రోజుల పాటు భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. గడిచిన 24 గంటల్లో 10 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైన భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ తదితర జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే 24 గంటల పాటు రెడ్అలెర్ట్ జోన్‌లో ఉన్న మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో తీసుకోవలసిన చర్యలపై కలెక్టర్లను, ఎస్పీలను అప్రమత్తం చేశారు. స్థానిక పరిస్థితుల మేరకు సహాయ చర్యల కోసం అవసరమైన జిల్లాలకు మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. పరిస్థితిని పర్యవేక్షించేందుకుగాను ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బంది సెలవులను రద్దు చేసి వెనక్కు పిలిపించాలని కలెక్టర్లను ఆదేశించారు. విపత్తుల నిర్వహణా శాఖ ఆయా జిల్లాల్లో ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీరాజ్, రహదారులు, పోలీస్ విభాగాలతో కలిసి సమన్వయంతో పనిచేయాలని

మిగితా 4వ పేజీలో

# 17 నుంచి ఓటు అధికార్ యాత్ర

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఓటర్ల జాబితాలో లోపాలపై ఈసీ, బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరింత దూకుడు పెంచారు. ఓటర్ల జాబితా సవరణ, ఓటు చోరీకి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు బిహార్‌లో "ఓటు అధికార్ యాత్ర" చేపట్టనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించిన ప్రకారం, ఈ యాత్ర ఆగస్టు 17న ప్రారంభమై, సెప్టెంబర్ 1న పట్నాలోని గాంధీ మైదానంలో భారీ ర్యాలీతో ముగుస్తుంది. ఇండియా కూటమి నాయకులతో కలిసి ఈ యాత్రను నిర్వహించనున్నారు.

**'డూ ఆర్ డై' సమస్య**

ఓటు చోరీ తమకు 'డూ ఆర్ డై' సమస్య అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఆగస్టు 22 నుంచి సెప్టెంబర్ 7 వరకు రాష్ట్ర స్థాయి కేంద్రాల్లో "ఓటు చోర్ %-% గద్దీ చోర్" ర్యాలీలు, సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఓటు హక్కు రక్షణ కోసం సంతకాల సేకరణ కార్యక్రమాలు చేపడతామని కన్హయ్య కుమార్ తెలిపారు. బిహార్‌లో ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది పేర్లు తొలగించారని, ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్య అని రాహుల్ గాంధీ ఆరోపించారు. డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని ఈసీని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఉభయసభల్లో కూడా ఈ అంశంపై విపక్షాలు ఆందోళనలు జరిపాయి.

# మరో మూడురోజులు భారీ వర్షాలు



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మరో మూడురోజులపాటు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతం, వాయువ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉత్తరాంధ్ర%-%దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలను ఆనుకొని అల్పపీడన వ్యవస్థ కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి దక్షిణ దిశగా వంగి ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 24 గంటల్లో ఇది దక్షిణ ఒడిశా, ఉత్తర కోస్తాంధ్ర మీదుగా పశ్చిమ%-%వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉందని అంచనా వేసింది.

**ఆరెంజ్ అలెర్ట్**

శుక్రవారం ఆదిలాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు ఐఎండీ ప్రకటించింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జనగాం, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం ఆదిలాబాద్, కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేయగా,

మిగితా 4వ పేజీలో

# రెండు నెలలుగా మైనస్‌లో ద్రవ్యోల్బణం

- **రాష్ట్ర ఆర్థిక పతనానికి సంకేతం: కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం మైనస్‌లోకి వెళ్లడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన సూచిక అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్ల పాటు దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలోనే ఆర్థికంగా చితికిపోయిందని ఆయన గురువారం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాల వల్లే ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు.

తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జూలై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందని తెలిపారు. జూలైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44 శాతంగా ఉండగా, జాతీయ సగటు ం2.10 శాతం ఉందన్నారు.



జూన్‌లో రాష్ట్రంలో -0.93 శాతం ఉంటే, దేశవ్యాప్తంగా ం1.55 శాతంగా నమోదైందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో డిఫ్లేషన్ మరింత తీవ్రంగా ఉందని చెప్పారు. ద్రవ్యోల్బణం తగ్గడం కొన్నిసార్లు సానుకూల సంకేతమని, కానీ ప్రస్తుత పరిస్థితి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తుండడంతో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు స్తంభించిపోయాయని అన్నారు. కొత్త ఉద్యోగాల సృష్టి లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడం ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా ఆర్థిక నిపుణులు సూచించారని, ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఒకప్పుడు దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందిన తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరమని, 'క్లూలెస్ కాంగ్రెస్' పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోందని కేటీఆర్ మండిపడ్డారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేసిందని, ఉద్యోగాల కల్పనపై ఎలాంటి స్పష్టమైన ప్రణాళికలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం ఐటీ, ఫార్మా, రియల్ ఎస్టేట్ రంగాల్లో దూసుకెళ్లిందని, ఇప్పుడు ఆ రంగాలన్నీ కుదేలయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్రం మళ్లీ పురోగతి పథంలో నడవాలంటే ప్రభుత్వం వైఫల్యాలను సరిదిద్దుకొని, తక్షణ ఆర్థిక సంస్కరణలు, ఉద్యోగ కల్పన కార్యక్రమాలు చేపట్టాలని కేటీఆర్ హితవు పలికారు.

# ప్రకృతిలో త్రివర్ణ పతాకం

**అనంతగిరి విద్యార్థిని సృజనకు అందరి ప్రశంసలు**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనంతగిరి లో నిర్వహించిన చిత్రలేఖన పోటీలో 10 వ తరగతి విద్యార్థిని వి. శ్రీవిద్య తన కళా ప్రతిభను వినూత్నంగా ఆవిష్కరించింది. సూర్యోదయపు కాంతిమయమైన నారింజ రంగు, స్వచ్ఛమైన నీలి ఆకాశం, పచ్చని పంట పొలాలను ఒకే చిత్రంలో సమన్వయం చేసి, దేశ జాతీయ పతాకం రంగులను ప్రకృతి సోయగాలతో కలిపినట్లు అద్భుతంగా చిత్రించడం జరిగింది. ఈ చిత్రం చూసిన ప్రతిఒక్కరూ విద్యార్థి సృజనాత్మకతను, దేశభక్తిని ప్రశంసించారు. ఉపాధ్యాయులు ఈ చిత్రాన్ని "స్వాతంత్ర్య స్ఫూర్తిని కళ రూపంలో ప్రతిబింబించిన అందమైన సృష్టి" గా అభివర్ణించారు. త్రివర్ణ పతాకం, దేశభక్తిని ప్రతిబింబించే ఈ చిత్రాన్ని చూసి ప్రధానోపాధ్యాయులు మొహమ్మద్ గౌస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలింగారెడ్డి , గైడ్ టీచర్ మొహమ్మద్ ఫరీదుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయిని- ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశంసలు కురిపించారు. విద్యార్థిని యొక్క ఈ సృజనాత్మక కృషి పాఠశాల గౌరవాన్ని మరింత పెంచింది.

# మంత్రి శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం

- **ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ఫ్లుయెన్షియల్ పీపుల్ ఇన్ ఏ ఐ-2025 జాబితాలో చోటు**
- **హర్షం వ్యక్తం చేసిన మానకొండూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**



రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ద్రుద్దిళ్ల శ్రీధర్ బాబుకు అరుదైన గౌరవం దక్కింది. అనలిటిక్స్ ఇండియా మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ - 2025' జాబితాలో ఆయనకు చోటు లభించింది. తమ సమర్థవంతమైన నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ భారత్ ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఈ జాబితాలో చోటు కల్పించారు. దీనిపై మానకొండూరు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.



# పోడు రైతులకు మద్దతుగా వెళ్లడం తప్పా

- **బీఆర్ఎస్ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవి గౌడ్**

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా గ్రామంలో పోడు రైతులకు మద్దతుగా నిలిచిన బిఆర్ఎస్ నేతల అక్రమ అరెస్టులను, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని బిఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా ఖండించారు. పోడు భూముల పట్టాలు ఇవ్వాలంటూ రోడ్డెక్కిన రైతులకు మద్దతుగా నిలవడమే బి ఆరఎస్ నేతలు చేసిన తప్పా అని ప్రశ్నించారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా వ్యవహరించడం విచారకరమని, రైతులకు బేడీలు వేయడం, అక్రమ అరెస్టులు చేయడం ఇందిరమ్మ రాజ్యానికి తగని పని అని రాష్ట్ర బిఆర్ఎస్ నాయకులు కంచర్ల రవిగౌడ్ మండిపడ్డారు. కౌటాల పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన ప్రవీణ్‌కుమార్, ఇతర బిఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్య వద్దాం అనిల్ గౌడ్ వేణు ఎస్.కె అప్రోచ్ ఎర్రబెల్లి జస్వంత్ మేకల సతీష్ తదితరులు పాల్గొన్నారు

# గంగాధరలో ఘనంగా తిరంగా ర్యాలీ



**బలగం టీవీ, గంగాధర**

తిరంగయాత్ర కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురనగర్ గ్రామంలో త్రివర్ణ పతాక వైభవాన్ని చాటడంలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు.గంగాధర మండల బిజెపిశాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు.జాతి సమైక్యతకు ప్రతీకగా నిలిచే ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర మండల ఎస్సై వంశీకృష్ణ, వైద రామానుజన్, జిల్లా కోశాధికారి,పెరక శ్రావణ్ కుమార్ అసెంబ్లీ కన్వీనర్,దూలం కళ్యాణ్ ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు, తుమ్ నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు,సదాల భాస్కర్ జిల్లా కౌన్సిల్ మెంబర్, మల్యాల వినయ్ సాగర్ జిల్లా ఎస్సీ మోక్ష అధికార ప్రతినిధి,శ్రీపతి రాజేంద్రప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి రేండ్ల శ్రీనివాస్,గాలిపెల్లి శ్రీనివాస్,మోతే నరసింహారెడ్డి,వోడ్నాల రాజు,గంగాధర రవి,హర్ష రాజు,ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు తాళ్ల రాజశేఖర్,సుంకరి అనిల్,తుమ్ కరుణాకర్,పెరుక మహేష్, బూత్ అధ్యక్షులు, బిజెపి నాయకులు, వివేకానంద హై స్కూల్,సురభి హై స్కూల్,విన్నర్స్ హై స్కూల్,పాఠశాల విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు, బిజెపి పార్టీ నాయకులు,తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు.

**బోయినిపల్లి మండల కేంద్రంలో ఘనంగా తిరంగా ర్యాలీ**

**బలగం టీవీ, బోయినిపల్లి**

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు హర్ ఘర్ తిరంగా అభియాన్ లో భాగంగా గురువారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ నుండి శ్రీరామాలయం మీదుగా బస్టాండ్ చౌరస్తా వరకు భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురాం అధ్యక్షతన హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ: 79 వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మన త్రివర్ణ పతాక వైభవాన్ని చాటడంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు మన సైనికుల వీరత్వానికి ప్రతీకగా నిలిచిన ఆపరేషన్ సింధూర్ విజయం పట్ల గర్వంతో, మన దేశ సైనికుల పరాక్రమంపై గర్వంతో జాతి సమైక్యతకు ప్రతీకగా ప్రతీ ఒక్కరం మన ఇళ్ళపై జాతీయ పతాకాన్ని ఎగురవేద్దాం, దేశభక్తిని చాటుకుందాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు బొంగోని అశోక్ గౌడ్, కందారపు వెంకటేష్, రాజురీ కిరణ్, తిప్పర వేణి శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు ఇల్లందుల పరుశరాములు, చంద్రయ్య, కళ్యాణం అనిల్, మెరుపుల గంగాధర్ గౌడ్, సింగరి వెంకటేష్, నాయిని నాగరాజు, శ్రీనివాస్, పబ్బాల వినోద్, అజయ్, కార్తీక్, శ్రీనివాస్ చారి, కిరణ్, సావన్ పెల్లి అనిల్,రాజు, భాస్కర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి చల్మెడ పరామర్శ

**బలగం టీవీ, తొంబారావుపేట:**





జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం తొంబారావుపేట మాజీ సర్పంచ్ ఏనుగు రాంరెడ్డి కుటుంబ సభ్యులను గురువారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట సీనియర్ నాయకులు రాజేశ్వర్ రెడ్డి, నల్ల గంగారెడ్డి, తిరుపతి రెడ్డి, మకిలి దాసు, అహ్మద్, భీమయ్య, జలంధర్ రెడ్డి, రాజేశం, లింబాద్రి, నర్సారెడ్డి, రవీందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గంగరాజం, శంకర్ రెడ్డి, రాంరెడ్డి, భిక్షపతి, కృష్ణ, తదితరులు ఉన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన చల్మెడ..

**బలగం టీవీ, కథలాపూర్**

భీమారం మండలం, గోవిందారం బిఆర్ఎస్ నాయకులు తోట రవీందర్ - జలజ దంపతుల కుమార్తె రుచిత వివాహ వేడుక గురువారం కథలాపూర్ మండల కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై, నూతన వధూవరులు రుచిత, సాయిచరణ్ లను ఆశీర్వదించారు.





# రోడ్డు అలా.. దవాఖానకు వెళ్ళే మార్గం ఏలా..?

- పల్లె దవాఖానాకు దారి లేక ప్రజలు ఇబ్బందులు..
- బీజేపీ మాజీ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్

**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పల్లె దవాఖానాకు వెళ్లే మార్గం లేకపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర వైద్య సేవలు పొందడంలో రోగులు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రమై, రోగులను తరలించడం దాదాపు అసాధ్యమవుతోందనీ , రోజూ వందలాది మంది వైద్య సేవల కోసం వస్తున్నా, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. గ్రామ ప్రజల ప్రాణాలను కాపాడే పల్లె దవాఖానాకు దారి సమస్యపై సంబంధిత అధికారులు సంబంధించి మరమ్మత్తు పనులు చేపట్టి సులభమైన రహదారి ఏర్పాటు చేయాలని శాశ్వతంగా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని మండల మాజీ బిజెపి అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్ కోరారు.



# పెద్దూరు పాఠశాలలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పెద్దూరు ఎంపీహెచ్ఎస్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. అందంగా అలంకరించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో చిన్ని కృష్ణులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. గోపికల వేషధారణలో ఉన్న బాలికలు తమ నృత్య ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్ మాట్లాడుతూ, శ్రీకృష్ణుడు ప్రవచించిన భగవద్గీతలోని సారాంశాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రయత్నలోపం లేకుండా తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. శ్రీకృష్ణుని జీవితం మనందరికీ ఆదర్శమని, ఆయన ఆపదలను, కష్టాలను ఎదుర్కొన్న యుక్తి, నైపుణ్యం అందరికీ ఆచరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్ తో పాటు ఉపాధ్యాయులు చక్రవర్తుల రమాదేవి, గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమా, బైరవాణి శ్రీ, కడార్ల కల్పన, నాగుల వీణ, నందాల శంకర్, జనగం రాజమల్లు, ఈరబోయిన రవికుమార్ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# అలంపూర్ జోగులాంబ అమ్మవారికి అగ్గిపెట్టెలో పట్టే చీర

- సమర్పించిన సిరిసిల్ల చేనేత కళాకారుడు..

**బలగం టీవీ, జోగులాంబ గద్వాల్**

సిరిసిల్ల చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ అద్భుత సృష్టి అలంపూర్ జోగులాంబ అమ్మవారికి చేరింది. అగ్గిపెట్టెలో పట్టేంత చిన్న పరిమాణంలో, కేవలం రెండు గ్రాముల బంగారు జరీతో నేసిన ఈ ప్రత్యేకమైన చీరను బుధవారం రోజున అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ, తన కళ ద్వారా అమ్మవారికి చీరను అందించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు హరిప్రసాద్ నైపుణ్యాన్ని కొనియాడుతూ, చేనేత కళకు ఆయన ఇస్తున్న గౌరవం గొప్పదని ప్రశంసించారు. ఈ అద్భుతమైన చీరను అమ్మవారికి అలంకరించడం ఆనందంగా ఉందని చెప్పారు, ఆలయ ప్రధాన అర్చకులు సంతోషం వ్యక్తం చేశారు.

# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి

- శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణి చేసిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ, వేములవాడ**



ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్హులైన 40 మంది లబ్ధదారులకు 12 లక్షల 93 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందన్నారు.. వైద్యారోగ్య రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందని రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజా ఆరోగ్య భద్రతపై ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారని తెలిపారు.మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 22 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు..



పేదలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలి పారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 10 సంవత్సరాలలో 400 కోట్లు పంపిణీ చేస్తే ప్రజా ప్రభుత్వ ఏర్పడిన నాటినుండి నేటి వరకు 800 కోట్ల మేర లబ్ధిదారులకు పంపిణీ చేయడం జరిగింది అన్నారు..

# కథలాపూర్‌లో ఆర్.జె. అసోసియేట్స్ ప్రారంభం

**బలగం టీవీ, కథలాపూర్:**

జగిత్యాల జిల్లా, వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్ మండల కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్.జె. అసోసియేట్స్, ఆర్కిటెక్ట్స్ కార్యాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, యువ పారిశ్రామికవేత్తలు తమ నైపుణ్యాలతో వ్యాపారాలను విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి సంస్థలు ఏర్పాటు చేయడం వల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఆధునిక నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఆర్కిటెక్ట్స్ పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సంస్థ మంచి సేవలు అందించి, వేగంగా అభివృద్ధి చెందాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆర్.జె. అసోసియేట్స్ నిర్వాహకులు, తదితరులు



పాల్గొన్నారు. యువ పారిశ్రామికవేత్తల ప్రయత్నాలను అభినందిస్తూ, వారి భవిష్యత్ ప్రణాళికలకు మద్దతు ఉంటుందని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# రైతులకు సరిపడా యూరియా పంపిణీ చేయాలి




- కేంద్రం రైతులకు యూరియా పంపిణీ తగ్గించడం దుర్మార్గమైన చర్య
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు మానుకొని రైతులకు న్యాయం చేయాలి
- ప్రైవేట్ ఫెర్టిలైజర్ షాపుల దోపిడి అరికట్టాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముషం రమేష్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా కేంద్రంలోని అమృత లాల్ శుక్ల కార్మిక భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ జిల్లాలోని రైతులకు వానకాలానికి సరిపోవు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు అలాగే జిల్లాలోని సహకార సంఘ గోదాముల వద్ద తెల్లవారుజాము నుండే బార్లు తీరుతున్న రైతుల బాధలు పట్టించుకునే నాధుడే లేడని అన్నారు ఇంత జరుగుతున్నా జిల్లా వ్యవసాయ అధికారులు మాత్రం జిల్లాలో యూరియా కొరతలేదని రైతులు ఆందోళన చెందవద్దని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు అలాగే ప్రైవేటు వ్యాపారులు కూడా ఇదే అదునుగా భావించి ఒక యూరియా బస్తా 310 రూపాయల నుండి 350 వరకు అమ్ముతూ యూరియాతోపాటు మిగతా పెటిలైజర్ కొంటేనే యూరియా ఇస్తామని అవసరం లేకున్నా దంటు గోళీలు గడ్డి మందు తదితర ఫెర్టిలైజర్ అంట కడుతున్నారని వారిపై వ్యవసాయ శాఖ ఎందుకు చర్య తీసుకోవడం లేదని ఆయన అన్నారు గతంలో ప్రతి సహకార సంఘ గోదాముల్లో నిల్వ ఉండే యూరియా బస్తాలు నేడు కనిపించడం లేదని యూరియా బస్తాలు కేటాయింపుల్లో కూడా పెద్ద రైతులు భూస్వాములు లైన్లో ఎక్కడ కనిపించడం లేదని ఎక్కడ చూసినా సన్నకారు చిన్న కారు రైతులే ఇబ్బందులు పడుతున్నారని మరి వారికి యూరియా ఎలా అందుతుందో అర్థం కావడం లేదని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి సీజనకు సరిపడా యూరియా సప్లై చేయాలని లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున రైతులతో ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోడం రమణ జవ్వాజి విమల గార్లు పాల్గొన్నారు




## చెన్నై గ్రాండ్ మాస్టర్స్ విజేత కెమెర్..

### అర్జున్‌కు రెండో స్థానం

బలగం టీవీ, హైదరాబాద్

చెన్నై చెస్ గ్రాండ్‌మాస్టర్స్ టైటిల్‌ను జర్మనీ కుర్రాడు విన్సెంట్ కెమెర్ సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో మరో రౌండ్ మిగిలున్నప్పటికీ ఎనిమిదో రౌండ్ గేమ్‌ను డ్రా చేసుకున్న కెమెర్.. ఈ టోర్నీ మూడో సీజన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఎనిమిదో రౌండ్‌లో అతడు.. జోర్డాన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. 8వ రౌండ్ ముగిసేసరికి కెమెర్.. 6 పాయింట్లతో అగ్రస్థానాన్ని కొనసాగించాడు. రెండో స్థానంలో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేసి.. ఎనిమిదో రౌండ్ గేమ్‌నూ డ్రా చేసుకోవడంతో అతడి ఖాతాలో 4.5 పాయింట్లే ఉన్నాయి. చివరి రౌండ్‌లో అతడు గెలిచినా 5.5 పాయింట్ల వద్దే ఆగిపోతాడు.




## సెప్టెంబర్ 5, 6న దుబాయ్‌లో సైమా అవార్డుల వేడుక

- **అల్లు అరవింద్ సంచలన వ్యాఖ్యలు**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రతిష్ఠాత్మక సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా)-2025 సెప్టెంబర్ 5, 6 తేదీల్లో దుబాయ్‌లో అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ వేడుకలకు సంబంధించిన ప్రెస్ మీట్ గురువారం హైదరాబాద్‌లో గ్రాండ్‌గా జరిగింది. ఈ సందర్భంగా జాతీయ అవార్డు విజేతలైన దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి (భగవంత్ కేసరి), దర్శకుడు సాయి రాజేష్, గాయకుడు రోహిత్ (బేబీ), దర్శకుడు ప్రశాంత్ వర్మ, విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు వెంకట్ (హనుమాన్)లను సైమా ఘనంగా సత్కరించింది.ఈ కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, "తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఎవరి కుంపటి వారిదే. ఈ ఏడాది జాతీయ పురస్కారాల్లో తెలుగు సినిమాలకు ఏడు అవార్డులు వచ్చాయి. తెలుగు సినిమాకు ఇన్ని అవార్డులు వచ్చినా మన పరిశ్రమ స్పందించలేదు. జాతీయ అవార్డులను పండుగలా జరుపుకోవాలి, కానీ ఇక్కడ అలా జరగడం లేదు. టాలీవుడ్‌లో ఎవరి కుంపటి వారిదే. అందుకే ఎలాంటి మంచి పనులు జరగడం లేదు" అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో హీరో సందీప్ కిషన్, హీరోయిన్లు వేదిక, ఫారియా అబ్దుల్లా, నటి మంచు లక్ష్మి, సైమా చైర్‌పర్సన్ బృందా తదితరులు పాల్గొన్నారు.

## బెయిల్ రద్దు... దర్శన్, పవిత్ర గౌడ అరెస్టు

బలగం టీవీ, హైదరాబాద్



రేణుకస్వామి హత్య కేసులో నిందితుడైన కన్నడ నటుడు దర్శన్ తూగుదీపను గురువారం బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. అతనికి సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేసిన కొద్ది గంటల్లోనే ఈ చర్య చేపట్టారు. దర్శన్‌తో పాటు అతని స్నేహితురాలు పవిత్ర గౌడను కూడా అరెస్టు చేశారు. వైద్య పరీక్షల అనంతరం ఇద్దరినీ జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో దర్శన్‌కు బెయిల్ ఇచ్చిన నిర్ణయాన్ని సవాల్ చేస్తూ కర్నాటక ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బెయిల్‌తో సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందన్న వాదనలతో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహాదేవన్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం బెయిల్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.ఇదే కేసులో సహనిందితులు ప్రదూష్, లక్ష్మణ్ ఎం, నాగరాజు ఆర్‌లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిగతా నిందితులు అనుకుమార్, జగదీష్‌లను త్వరలోనే అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. దర్శన్‌ను బళ్లారి సెంట్రల్ జైలు లేదా పరప్పన అగ్రహార జైలుకు తరలించే అవకాశం ఉంది.

గత ఏడాది జూన్‌లో చిత్రదుర్గకు చెందిన రేణుకస్వామి హత్యకు గురైన ఈ కేసులో దర్శన్, పవిత్ర గౌడతో పాటు 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కర్నాటక హైకోర్టు 2024 అక్టోబర్‌లో మధ్యంతర బెయిల్ ఇచ్చి, అదే ఏడాది డిసెంబర్‌లో రెగ్యులర్ బెయిల్‌ను మంజూరు చేసింది. అయితే, ఆ నిర్ణయంపై కర్నాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా, తాజాగా బెయిల్‌ను రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- **గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి**

బలగం టీవీ, హైదరాబాద్

భారతదేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రాష్ట్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. శుక్రవారం వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలాడనుంది. ఈ వేడుకల ను ఘనంగా నిర్వహించేందుకు హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కలెక్టరేట్లలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. వేడుకల్లో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఉదయం 9 గంటలకు గోల్కొండ కోటలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. శాసనమండలిలో చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. సచివాలయంలో జరిగే వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరవుతారు. కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షులు బి.మహేశ్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగే వేడుకల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. అక్కడే ఆయన జాతీయ జెండాను ఎగురవేసి ప్రసంగిస్తారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో మఖ్దూంభవన్‌లో ఆ పార్టీ నేత చాడ వెంకటరెడ్డి, టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. ఇప్పటికే జిల్లాల్లో జరిగే వేడుకలకు హాజరయ్యే మంత్రులు, అతిథులు, ప్రజా ప్రతినిధుల పేర్లను వెల్లడిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో జారీ చేసిన సంగతి తెలిసిందే. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు రాజ్‌భవన్‌లో ఎట్ హోం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. మంత్రులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ. కోటి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. వర్షం పడే సమయంలో విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండకూడదని కోరారు. క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామనీ, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మున్సిపల్, మెట్రో వాటర్ బోర్డు, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైల్వే లైన్లు, లోలెవెల్ బ్రిడ్జీలు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి వర్షం నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని గస్తీ కోసం నియమించాలని ఆదేశించారు. అంటువ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు, ముంపు ప్రాంతాల్లో త్రాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిత్యం వరద తాకిడికి గురయ్యే లోతట్టు ప్రాంతాలను గుర్తించి వారికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని కలెక్టర్లకు సూచించారు. అర్హులైన పేదలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంతో పాటు జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

## మరో మూడురోజులు భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

హన్మకొండ, జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాలకు ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. వీటికి ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

వర్షపాతం గణాంకాలు

గడిచిన 24 గంటల్లో ఆదిలాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో అత్యధికంగా 19.8 సెం.మీ. వర్షపాతం నమోదైందని టీజీడీపీఎస్ తెలిపింది.

## 19 నుంచి డీసెట్ స్పాట్ అడ్మిషన్లు

(మొదటి పేజీ తరువాయి)

డైట్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 2,720 సీట్లున్నాయని వివరించారు. 2,141 సీట్లు భర్తీ అయ్యాయని తెలిపారు. ఇంకా 579 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటా కింద అదనంగా 412 సీట్లు అందుబాటులో ఉంటే 95 మంది చేరారని వివరించారు. ఇంకా 317 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డీసెట్ స్పాట్ అడ్మిషన్లలో 1,131 సీట్లు భర్తీ చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు.

## ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు

బలగం టీవీ, హైదరాబాద్




మాహిష్మతి ప్రొడక్షన్స్ పతాకంపై తోట రామకృష్ణ దర్శకత్వం, నిర్మాణంలో రూపుదిద్దుకుంటున్న "ఒక పార్వతి ఇద్దరు దేవదాసులు" చిత్రంలో సిద్ధార్థ్ మీనన్, దిలీప్ హీరోలుగా, రాశి సింగ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాలేజ్ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ యువతరాన్ని ఆకట్టుకునేలా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాలో రఘుబాబు, కశిరెడ్డి రాజ్‌కుమార్, వీర శంకర్, గౌతం రాజు, రాకెట్ రాఘవ, గుండు సుదర్శన్, రవితేజ, రజిత తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి.

ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్ మంచి స్పందనను తెచ్చుకుంది. సంగీతం మోహిత్ రహమానియాక్ అందించగా, ఆస్కార్ విజేత చంద్రబోస్, సుద్దాల అశోక్ తేజ, భాస్కరభట్ల వంటి గీతరచయితలు పాటలు రాశారు. శ్రీనివాసరాజు సినిమాటోగ్రఫీ, గన్ ఎడిటింగ్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. శరత్ వర్మ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, పీఆర్ఓలు గణేష్, కుమార్ వ్యవహరిస్తున్నారు.

## స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

సమరాన్ని నిరాయుధ శాంతియుత పద్ధతిలో నడిపించిన మహాత్మాగాంధీ అహింసా పద్ధతిలో నడిచిన దేశ స్వాతంత్ర్య పోరాట కార్యాచరణ స్ఫూర్తి, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమంలో ఇమిడివున్నదని తెలిపారు. జాతి ఆత్మగౌరవం కోసం స్వయంపాలన కోసం చేసిన త్యాగాలు స్వాతంత్ర్యానంతర భారతదేశంలో స్వార్థ రాజకీయాలకోసం దుర్వినియోగం కావడం బాధాకరమని కేసీఆర్ తెలిపారు. స్వతంత్ర్య భారతదేశంలో ప్రత్యేక రాష్ట్రంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం పదేండ్ల అనతికాలంలోనే ఆదర్శంగా నిలవడం గర్వంగా ఉందన్నారు. అమరుల త్యాగాలను గౌరవించి, స్వాతంత్ర్య ఫలాలు చివరి గడపకు చేరి, దేశ సమగ్రాభివృద్ధికి దోహదం చేసిన నాడే దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు మరింత ఇనుమడిస్తాయని కేసీఆర్ స్పష్టం చేశారు.